

... బకాయిలు విడుదల

మహిళా సంఘాలకు పెండింగ్ ఉన్న వడ్డీ లేని రుణాల బకాయిలను ప్రభుత్వం విడుదల చేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. 8లో



తేలని పోడు పోరు

కారేపల్లి మండలంలో పోడు భూముల వివాదం తేలక పోడుదారులు – అటవీ ఉద్యోగుల నడుమ తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
33° / 24°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల జల్లులు మొదలు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు

- అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

సత్తుపల్లిటౌన్: ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నందున శ్రద్ధగా చదువుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. సత్తుపల్లిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, రేజర్ల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించడమే కాక ప్రైవేట్ పాఠశాలల నుంచి ఎక్కువ మంది చేరడం, పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబర్చడంపై ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు, ఉపాధ్యాయులను అభినందించారు. ఆతర్వాత విద్యార్థులతో కలిసి ఆమె మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొండ్రు నర్సింహ, ఎంపీఈఓ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూభారతి చట్టం అమలు

- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



గురుకుల పాఠశాలలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

బోనకల్: భూభారతి చట్టం పకడ్బందీగా అమలయ్యేలా ఉద్యోగులు శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. బోనకల్ తహసీల్‌ను గురువారం తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించారు. అలాగే, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్, పరిశీలన, పరిష్కారంపై ఆరా తీసి సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ విద్యార్థుల ప్రగతిని పరీక్షించాక ఆవరణలో మొక్కలు నాటారు. హాస్టల్ భవనం స్లాబ్ పెచ్చులు పడుతుండడం, ప్రహరీ లేక ఎదురవుతున్న ఇబ్బందులను ప్రిన్సిపాల్ పద్మావతి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తహసీల్దార్ రమాదేవి, ఆర్‌ఐలు నవీన్, మైథిలి పాల్గొన్నారు.

ఎంపీఓలకు ఎంపీడీఓలుగా బాధ్యతలు

ఖమ్మంసహకారనగర్: జిల్లాలోని నాలుగు మండలాల ఎంపీడీఓలు సొంత జిల్లాలకు బదిలీ కావడంతో అక్కడ ఎంపీఓలకు ఎంపీడీఓలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కారేపల్లి ఎంపీడీఓ జి.సురేందర్ జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు వెళ్లగా అక్కడ ఎంపీఓ ఎం.రవీంద్రప్రసాద్‌కు బాధ్యతలు అప్పగిస్తూ జెడ్పీ సీఈఓ దీక్షారైనా ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, మహబూబాబాద్ జిల్లాకు వెళ్లిన ఖమ్మంరూరల్ ఎంపీడీఓ ఎస్.కుమార్ స్థానంలో ఎంపీఓ కె.శ్రీదేవికి, కూసుమంచి ఎంపీడీఓ డి.వేణుగోపాల్‌రెడ్డి స్థానంలో ఎంపీఓ ఎం.రామచందర్‌రావుకు, కొణిజర్ల ఎంపీడీఓ ఏ.రోజారాణి స్థానంలో ఎంపీఓ ఉపేంద్రయ్యకు బాధ్యతలు అప్పగించారు. బదిలీ అయిన ఎంపీడీఓలు 2024 లోక్‌సభ ఎన్నికల సమయాన జిల్లాకు రాగా.. ఇప్పుడు మళ్లీ సొంత జిల్లాలకు బదిలీ అయ్యారు.

లక్ష్యం మేర బొగ్గు ఉత్పత్తి, రవాణా



వ్యూ పాయింట్ నుంచి పరిశీలిస్తున్న డైరెక్టర్ గౌతమ్

సత్తుపల్లిరూరల్: బొగ్గు ఉత్పత్తి, రవాణాకు సంబంధించి రోజువారీ లక్ష్యాలను అధిగమించాలని సింగరేణి డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు ఆదేశించారు. సత్తుపల్లిలో జేవీఆర్ ఓసీ, సీహెచ్‌పీలను గురువారం ఆయన కొత్తగూడెం ఏరియా జీఎం షాలేం రాజుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి, ఉద్యోగుల రక్షణ చర్యలపై సూచనలు చేశారు. అలాగే, జేవీఆర్ సీహెచ్‌పీ నుంచి రైలుమార్గం బొగ్గు రవాణాను పరిశీలించిన డైరెక్టర్ సైలో బంకర్ వద్ద తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీయడమే కాక వ్యూ పాయింట్ వద్ద మొక్కలు నాటారు. ఉద్యోగులు కోటిరెడ్డి, సూర్యనారాయణరాజు, ప్రహ్లాద్, నర్సింహారావు, సోమశేఖర్, మోహన్‌రావు, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

అటు ఓకే.. ఇటే లేటు



ఖమ్మంలో జరిగిన ప్రజాపాలన సభలో దరఖాస్తుకు బారులుదీరిన జనం (ఫైల్)

రేషన్‌కార్డుల జారీలో జాప్యంపై ఆగ్రహం

- నత్తనడకన ప్రజాపాలన దరఖాస్తుల పరిశీలన
- మీ సేవ ద్వారా వస్తే వెంటవెంటనే మోక్షం
- ముందస్తు ఒప్పందాలే కారణమని విమర్శలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం/ఖమ్మం సహకారనగర్: నూతన రేషన్‌కార్డుల జారీ ప్రక్రియలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కారాన్ని పట్టించుకోని అధికారులు.. మీ సేవ కేంద్రాల ద్వారా వస్తే మాత్రం వెనువెంటనే పరిష్కరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రజాపాలన సభల్లో అందిన దరఖాస్తుల్లో సగం మేర మాత్రమే పరిశీలనకు నోచుకోగా... మీ సేవలో వచ్చిన 41,340 దరఖాస్తుల్లో 21,713 మాత్రమే పరిష్కరించడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది.

ప్రజాపాలనలో 68 వేలు..

ఆరు గ్యారంటీల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ప్రజాపాలన సభల ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. ఈ క్రమంలో రేషన్ కార్డుల కోసం 68,212 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే, నెలలు గడుస్తున్నా కార్డులు అందకపోగా, ఇప్పటి వరకు 34,983 దరఖాస్తులను పరిశీలించారు. వీరిలో కేవలం 5,838 మందికే కార్డులు మంజూరయ్యాయి. దీంతో దరఖాస్తుదారులు తమ పరిస్థితి ఏమిటంటూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

మీ సేవలో దరఖాస్తు చేస్తే ఓకే..

ప్రజాపాలనలో సభల్లో దరఖాస్తులు స్వీకరించడమే కాక గడువు ముగిశాక కూడా అవకాశం కల్పించారు. కొన్నిచోట్ల స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. ఇక రేషన్‌కార్డుల కోసం మీ సేవ ద్వారా కూడా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఈక్రమాన మీ సేవ నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం 41,340 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 21,713 అప్రూవ్ చేసి, 519 దరఖాస్తులు తిరస్కరించారు. కానీ ప్రజాపాలన దరఖాస్తుల్లో సగం మేర మాత్రమే పరిశీలించి, మీ సేవ నుంచి వచ్చిన దరఖాస్తుల్లో సగానికి పైగా మంజూరు చేయడం గమనార్హం.

మేమే ఇప్పిస్తాం...

దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా కనీసం పరిశీలన కూడా జరగకపోవడంపై జనాల్లో అసహనం వ్యక్తమవుతోంది. ఇటీవల మీ సేవలో దరఖాస్తు చేసుకున్న వారికి రేషన్‌కార్డులు మంజూరు చేసి, తమను విస్మరిస్తుండడంతో మండిపడుతున్నారు. మరోమారు మీ సేవలో దరఖాస్తు చేయాలనుకున్నా అనుమతించక ఏం చేయాలో పాలు పోని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కాగా, కొంద రు మీసేవ సెంటర్ల నిర్వాహకులు, రెవెన్యూ సిబ్బంది కుమ్మక్కవడమే ఇందుకు కారణమనే ఆరోపణలు వస్తున్నాయి. మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే సమయానే రేషన్ కార్డు త్వరగా ఇప్పిస్తామని రూ.3 వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఇందులో రెవెన్యూ సిబ్బందికి కొంత వాటా ముట్టచెప్పి ఎలాంటి పరిశీలన లేకుండానే మంజూరు చేయిస్తున్నట్లు తెలిసింది. మీసేవల్లో దరఖాస్తు చేసిన వారికి త్వరగా కార్డులు వస్తుండడం, ప్రజాపాలన సభల్లో ఇచ్చిన దరఖాస్తులు పరిశీలనకు నోచుకోకపోవడంతో ఈ ఆరోపణలు నానాటికీ పెరుగుతున్నాయి.

	ప్రజాపాలన సభలు	మీ సేవా కేంద్రాలు
అందిన దరఖాస్తులు	68,212	41,340
పరిశీలించినవి	34,983	22,232
పెండింగ్ / తిరస్కరించినవి	33,229	19,108
కార్డుల జారీ	5,838	21,713



ఇది ఆడబిడ్డల ప్రభుత్వం



సత్తుపల్లిలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన అదనపు కలెక్టర్ శ్రీజ, ఎమ్మెల్యే రాగమయి తదితరులు

- గత ప్రభుత్వ లోపాలన్నీ సరిచేస్తున్నాం
- ఏ ఎన్నికలు వచ్చినా మమ్మల్ని ఆశీర్వదించండి
- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లి: ఎవరికి ఓటు వేశారు, ఏ పార్టీ, ఏ కులం అని అడగకుండా పేదరికమే అర్హతగా సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా.. ఆడబిడ్డల అభ్యున్నతే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సత్తుపల్లిలో గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అధ్యక్షతన నిర్వహించిన ఇందిరమ్మ మహిళాశక్తి సంబురాల్లో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి రైతులకు ఉచిత కరెంట్ అందిస్తే తమ ప్రభుత్వం 200యూనిట్ల మేర ఉచిత విద్యుత్ ఇస్తోందని, వైఎస్సార్ హయాంలో మహిళా సంఘాలకు అమలైన పావలా వడ్డీ రుణాలను సైతం పునరుద్ధరించామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోని లోపాలను సరిచేస్తూ.. ఎన్నికల సమయంలో చెప్పినవి, చెప్పనవి కూడా ఏడాదిన్నరలో అమలుచేశామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలుచేస్తున్నామని వివరించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ అరకొరగా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేసిందే తప్ప పేదలకు ఇళ్లు ఇవ్వాలనే ఆలోచన చేయలేదని పొంగులేటి విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడే డబుల్ బెడ్ రూం ఇళ్ల పేరిట హడావుడి చేసిన ఆ పార్టీ నేతలు ఏటా రెండు లక్షలు ఇళ్లు ఇచ్చినా పదేళ్లలో 20లక్షల మంది పేదలకు లబ్ధి జరిగేదని చెప్పారు. ఈనేపథ్యాన ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొచ్చిన ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని మంత్రి కోరారు. కాగా, సత్తుపల్లిలో మహిళా శక్తి భవనానికి స్థలం సేకరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.



కూసుమంచిలో మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ అనుదీప్, సీపీ సునీల్‌దత్ తదితరులు

మహిళల పేరిటే పథకాలు

సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వాన కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. మహిళల పేరిట ఇప్పటికే బస్సులు ఇవ్వగా, త్వరలోనే రైస్‌మిల్లులు, క్యాంటిన్, జిరాక్స్ సెంటర్లు వస్తాయని చెప్పారు. నియోజకవర్గానికి అదనంగా 1,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంపై మంత్రి పొంగులేటికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ఆర్డీఓ రాజేంద్రగౌడ్, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, వ్యవసాయ మార్కెట్ల చైర్మన్లు దోమ ఆనంద్, నీరజాదేవి, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, శివవేణు, చల్లగుళ్ల నర్సింహారావు, నారాయణవరపు శ్రీనివాసరావు, చల్లగుండ్ల కృష్ణయ్య, ఎం.డీ.కమల్‌పాషా, గాదె చెన్నారావు, సందీప్‌గౌడ్, దూదిపాల రాంబాబు, గోలి ఉషారాణి, తోట సుజలరాణి, పద్మజ్యోతిరెడ్డి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

పాలేరు.. నా తల్లి వంటిది

కూసుమంచి: నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి తరహాలోనే మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా పథకాలు అమలుచేస్తున్నామని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. పాలేరు నియోజకవర్గ స్థాయి ఇందిరా మహిళా శక్తి సంబురాలు కూసుమంచిలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక గ్రూపు సభ్యులకు వడ్డీ లేని రుణాలు, ప్రమాద బీమా చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి అందజేశారు. అనంతరం పొంగులేటి మాట్లాడుతూ పాలేరు నియోజకవర్గం తన తల్లి వంటిదని, ఇక్కడి ప్రజలకు ఏ ఇబ్బంది రానివ్వనని తెలిపారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందిస్తామే తప్ప పార్టీ, కులం, మతం చూడమని చెప్పారు. నాటి ప్రభుత్వం బెల్ట్ దుకాణాలను ప్రోత్సహిస్తే తాము రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్నబియ్యం ఇస్తున్నామని వెల్లడించారు. అలాగే, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో పేదలను ఆదుకుంటున్నామని తెలిపారు. ఈమేరకు ఏ ఎన్నికలు వచ్చినా తమ ప్రభుత్వాన్ని పెద్దమనుసుతో దీవించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, డీఆర్డీఓ సన్యాసయ్య, ఆర్డీఓ నర్సింహారావు, పాలేరు ప్రత్యేకాధికారి రమేష్, మండల ప్రత్యేకాధికారి శ్రీలత, తహసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

నాణ్యతతో పాటు వేగం ముఖ్యమే..



కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల, పక్కన మేయర్, కమిషనర్ తదితరులు

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఅర్బన్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించడమే కాక వేగంగా పూర్తయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మం 37వ డివిజన్‌లో గురువారం రూ.175 లక్షలతో నిర్మించే షాపింగ్ కాంప్లెక్స్ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు చేపట్టే పనుల్లో ప్రజల భాగస్వామ్యం అవసరమని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అందరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కాగా, రహదారుల వెడల్పుతో మెరుగైన రవాణా సౌకర్యం ఏర్పడడమే కాక ట్రాఫిక్ ఇక్కట్లు తీరుతాయని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, శరత్, కమర్తపు మురళి, ఆర్డీఓ నర్సింహారావు, తహసీల్దార్ సైదులు, కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, మందడపు మనోహర్, షాకిత్ అలీ, ముక్తార్, నాగండ్ల దీపక్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని పలుచోట్ల వర్షం

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం 6–30 గంటల తర్వాత మొదలైన వర్షం రాత్రి వరకు కొనసాగింది. అయితే, గాలిదుమారం కారణంగా పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి రహదారులపై పడడంతో వాహన రాకపోకలు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వేంసూరులో అత్యధికంగా 87 మి.మీ.ల వర్షపాతం నమోదు కాగా మధిరలో 67.3 మి.మీ.లు, మధిర ఏఆర్‌ఎస్ వద్ద 50.3, పల్లెగూడెంలో 42.8, గేటుకారేపల్లిలో 40.5, తిరుమలాయపాలెంలో 39, పెద్దగోపతిలో 27.5, కూసుమంచిలో 25.3, ఖమ్మం కలెక్టరేట్ వద్ద 23.3, రఘునాథపాలెంలో 23, రావినూతలలో 21.8, సదాశివునిపాలెంలో 20.8 వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. కాగా, ఈ వాన సాగులో ఉన్న పంటలకు ప్రయోజనం కలిగిస్తుందని చెబుతున్నారు.

నేడు ఉమ్మడి జిల్లాలో కేటీఆర్ పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు ఖమ్మంలోని మమత మెడికల్ కళాశాల మైదానానికి హెలీకాప్టర్‌లో చేరుకోనున్న ఆయన కవిరాజ్‌నగర్‌లో ఇటీవల మృతి చెందిన మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ కుటుంబాన్ని పరామర్శిస్తారు. అక్కడ నుంచి భద్రాద్రి జిల్లా కరకగూడెం మండలం సమత్ భట్టుపల్లికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును పరామర్శించనున్నారు. కాంతారావు తల్లి ఇటీవల మృతి చెందగా, ఆమెకు నివాళులర్పించాక హైదరాబాద్ బయలుదేరతారు.

పంటలపై వరుణుడి పగ

- వర్షాభావంతో వడబడుతున్న చేన్లు
- ఇంకో పక్క వేసవిని తలపిస్తున్న ఎండలు
- లక్ష్యం మేర నమోదు కాని పంటల సాగు





అమ్మపేటలో వడబడిన పత్తి మొక్కలు

ఖమ్మంవ్యవసాయం/తల్లాడ/ముదిగొండ: వానదేవుడి కటాక్షం లేకపోవడం.. ఇంకోపక్క వేసవిని తలపించేలా ఎండలు దంచి కొడుతుండడంతో పంటల సాగుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇప్పటికే మొలకెత్తిన పత్తి మొక్కలు, వరినార్లు ఎండిపోయే దశకు చేరడంతో రక్షించేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. ఇక వర్షాభావ పరిస్థితుల్లో జిల్లాలో ఇప్పటివరకు లక్ష్యం మేర పంటల సాగు కాకపోవడం గమనార్హం. జూన్‌లో సాధారణ వర్షపాతం 131.2 మి.మీ.కు గాను 123.9 మి.మీ. నమోదు కాగా, ఈనెల 16వ తేదీ వరకు వరుణుడు కరుణ చూపలేదు. ఇప్పటివరకు 130 మి.మీ.ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా కేవలం 84.2 మి.మీ.గానే నమోదైంది. ఇక గురువారం కొన్నిచోట్ల వర్షం కురిసినా పంటలకు పెద్దగా ఉపయోగపడే పరిస్థితి కానరావడం లేదు. జిల్లాలోని కారేపల్లి, రఘునాథపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ముదిగొండ, చింతకాని, ఖమ్మం అర్బన్, వైరా, బోనకల్, మధిర, ఎర్రుపాలెంలో లోటు వర్షపాతం ఉండగా, మిగిలిన పది మండలాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది.

వానాకాలమా.. ఎండాకాలమా?

ప్రస్తుతం జిల్లాలో మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు వేసవిని తలపిస్తున్నాయి. ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి తీవ్రరూపం దాల్చి గరిష్ఠంగా 40 డిగ్రీల మేర ఉష్ణోగ్రత నమోదవుతోంది. గురువారం వైరా మండలంలో గరిష్ఠంగా 39.2 డిగ్రీలు, మిగిలిన మండలాల్లో సగటున 38 డిగ్రీలుగా నమోదైంది. ఉష్ణోగ్రతలకు తోడు ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

వడబడుతున్న పంటలు

వర్షాభావ పరిస్థితులకు తోడు ఎండల కారణంగా పంటలు వడబడుతున్నాయి. మే చివరి వారం, జూన్‌లో అప్పుడప్పుడు కురిసిన అకాల వర్షాలతో పత్తి, అపరాల పంటలను సాగు చేశారు. కానీ ఈ పంటలు ప్రస్తుత పరిస్థితులతో బెట్టకేశాయి. మరోపక్క అనుకూలించని వర్షాలతో మెట్ట పంటల సాగు లక్ష్యం కూడా చేరలేదు. పత్తి పైరల్లో ఎదుగుదల లోపించగా, పెసర పైర్లు కూడా వడబడుతున్నాయి. ఇక జూలై 15 నాటికి పత్తి సాగు లక్ష్యం 2,15,643 ఎకరాలకు చేరాల్సి ఉన్నా మరో 10వేల ఎకరాలు వెనకబడి ఉంది. పెసర, మొక్కజొన్న పరిస్థితి అలాగే ఉండగా కంది, వేరుశనగ పంటల సాగు మొదలేకాలేదు.

వరి దారుణం

జిల్లాలో ప్రధాన పంటగా సాగయ్యే వరి ఎక్కడా ఊపందుకోలేదు. జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 2,87,928 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 64,989 ఎకరాల్లో నాట్లు వేశారు. ఇంకా 87,462 ఎకరాలకు సరిపడా నారు పోసినట్లు అంచనా. అయితే, ఈ నారును కాపాడుకునేందుకు బోర్లు, బావుల ద్వారా నీరు పడుతున్నారు. కాగా, వర్షాలు లేకున్నా కృష్ణా, గోదావరి జలాలు జిల్లాకు చేరడంతో నాట్లు మొదలయ్యే అవకాశముంది. ఇక సాగర్ జలాలు విడుదల చేసినా చివరి భూములకు అందడం లేదని.. రైతుల ఇక్కట్లను పరిగణనలోకి తీసుకుని కాల్వలు మరమ్మతు చేయించాలని పలువురు కోరుతున్నారు.

రెండు సార్లు విత్తాను..



పదెకరాల్లో పత్తి సాగుకు సిద్ధమై గింజలు నాటితే మొలకెత్తలేదు. దీంతో రెండోసారి విత్తాం. మొక్కలు వచ్చినా సరిగా ఎదగడం లేదు. బావి పక్కనే బోరు వేసి ఆ నీటిని బావిలోకి మళ్లించి పంట అవసరాలకు వాడుతున్నా.

– పుచ్చకాయల అప్పారావు, రైతు, అమ్మపేట, ముదిగొండ మండలం

యూరియా ద్రావకం పిచికారీ చేయాలి



వర్షాభావం నేపథ్యాన మొక్కల రక్షణకు యూరియా ద్రావకాన్ని పిచికారీ చేయాలి. యూరియా ద్రావకంతో పాటు నానో యూరియాను కూడా అధికారుల సూచనలతో పంటలపై పిచికారీ చేస్తే వడబాటు కాకుండా 15 రోజులు ఉంటాయి.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి



పై ఫొటోలో ఎడమ చివర ఉన్న రైతు తల్లాడకు చెందిన అక్కల ప్రభాకర్‌రెడ్డి. మూడెకరాల వరి సాగుకు నారు పెంచాడు. జూన్‌లో నారు పోయగా వర్షాలతో బాగానే ఎదిగింది. కానీ ఆతర్వాత వర్షాలు లేక నారు మడి ఎండిపోయే స్థితికి చేరింది. దీంతో ట్యాంకర్ ద్వారా నీరు తెప్పించి నారుమడికి పట్టాడు. ఏడు ట్యాంకర్ల నీరు పడితే నారు మడి తడిసిందని చెబుతున్నాడు.



బాణాపురంలో వరి విత్తనాలు చల్లేందుకు దుక్కిలో పడుతున్న బోరు నీరు

జిల్లాలో ప్రధాన పంటల సాగు వివరాలు (ఎకరాల్లో)

పంట	సాధారణ సాగు	ఇప్పటి వరకు సాగు
వరి	2,87,928	64,989
పత్తి	2,15,648	2,04,857
మొక్కజొన్న	2,327	922
పెసర	16,838	12,684
మిర్చి	75,407	390
కూరగాయలు	242	60

క్లుప్తంగా

5 నుంచి రాజీవ్ గాంధీ స్మారక క్రికెట్ టోర్నీ

ఖమ్మం స్పోర్ట్స్: రాజీవ్‌గాంధీ స్మారక క్రికెట్ టోర్నీని వచ్చే నెల 5 నుంచి నిర్వహించనున్నట్లు ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.డీ.మతిన్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఖమ్మంలోని సర్దార్‌పటేల్ పటేల్ స్టేడియంలో మండల స్థాయి ఆర్గనైజర్లతో సమావేశమయ్యాక ఆయన మాట్లాడారు. అండర్–12, 14, 16 కేటగిరీల వారీగా ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనుండగా, అండర్–12 పోటీలు ఖమ్మంలో, అండర్–14 కొత్తగూడెంలో, అండర్–16 కల్లూరులో ఏర్పాటుచేస్తామని తెలిపా రు. ఈ సమావేశంలో వెంకన్న, గౌస్, ఫరీద్ ఖాద్రీ, నిరంజన్, శ్రీనివాస్, సిద్ధు, కిషాన్, శ్రీకాంత్, సుభద్ర, ఇమ్రాన్, ప్రసాద్ పాల్గొన్నారు.

23న విద్యాసంస్థల బంద్

ఖమ్మంమయూరిసెంటర్: విద్యారంగం, ప్రభుత్వ విద్యాసంస్థల్లో సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన ఈనెల 23న విద్యాసంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శులు తుడుం వంగూరి వెంకటేష్, మస్తాన్ మాట్లాడారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుచేయాలనే డిమాండ్‌తో బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షు డు లక్ష్మణ్, నాయకులు మధు, శివనాయక్, వంశీ, రాజు, త్రినాథ్, లోకేష్, శ్రీకాంత్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించిన మంత్రి

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లి వద్ద జరిగిన రోడ్డుప్రమాదంలో గాయపడిన వ్యక్తిని ఆ మార్గంలో వెళ్తున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గుర్తించి ఆస్పత్రికి తరలించారు. మద్దులపల్లికి చెందిన నల్లపునేని రాజా బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయపడ్డాడు. కదలలేని స్థితిలో ఉండగా, కూసుమంచి నుంచి వస్తున్న మంత్రి తన కాన్వాయ్ ఆపి ఆయనను మరో వాహనంలో ఆస్పత్రికి పంపించారు.

శుద్ధ జలాల సరఫరాపై ప్రత్యేక దృష్టి

ఖమ్మంఅర్బన్: మిషన్ భగీరథ ద్వారా ప్రజ లకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని భగీ రథ ఇంజనీర్ ఇన్‌చీఫ్(ఈఎన్‌సీ) కృపాకర్‌రెడ్డి ఆదేశించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మిష న్ భగీరథ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను గురువారం ఆయన పరిశీలించారు. తల్లాడ మండలంలోని కరుణగిరి హిల్స్, కొణిజర్ల మండలంలోని తనికెళ్ల ముక్రీహిల్స్ వద్ద ఉన్న ప్లాంట్లను ఇంజనీర్లతో కలిసి పరిశీలించిన ఆయన వాటి పనితీరు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, తాగునీటి శుద్ధి, సరఫరాపై ఆరా తీశారు. లీకేజీలను ఎప్పటికప్పుడు సరిచేయాలని సూచించారు. మిషన్ భగీరథ సీఈలు కె.శ్రీనివాస్, ఎస్‌ఈ శేఖర్‌రెడ్డి, ఈఈ వాణిశ్రీ, డీఈలు, ఏఈ లు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం నుంచి ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తుండడంతో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించారు. గాలులతో రాత్రి వేళ చెట్లు, స్తంభాలు కూలినా, ఇతర ఇబ్బందులు వచ్చినా ప్రజలు 24గంటల్లో ఎప్పుడైనా ఫిర్యాదు చేసేలా కంట్రోల్ రూం ఏర్పాటైంది. ఈమేరకు ప్రజలు తమ సమస్యలను 83338 33696 నంబర్ ద్వారా తెలియజేయొచ్చని కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు.

డ్రాపౌట్లు ఉండొద్దు..

తిరుమలాయపాలెం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరిన విద్యార్థులు మధ్యలో మానివేయకుండా అధ్యాపకులు పర్యవేక్షించాలని రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు పరిశీలకుడు హేమసుందర్ సూచించారు. తిరుమలాయపాలెం మండలంలోని పిండిప్రోలు కళాశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశమై ప్రవేశాలు, విద్యార్థుల హాజరు, బోధనపై సూచనలు చేశారు

1,100 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం

కామేపల్లి: ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని 1,100 ఎకరాల్లో వివిధ రకాల పండ్ల తోటల పెంపకం చేపట్టనున్నట్లు డీఆర్‌డీఓ ఏపీడీ శిరీష తెలిపారు. మండలంలోని కొత్తలింగాలలో రైతు నాగేశ్వరరావు ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ తోటను గురువారం ఆమె పరిశీలించారు. ఈజీఎస్ ద్వారా అందిన చేయూత, సాగు విధానం దిగుబడి వివరాలు ఆరా తీశాక ఆమె మాట్లాడారు. డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు జామ, నిమ్మ, మామిడి, ఆయిల్ పామ్, మునగ సాగుకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. హార్టికల్చర్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఉద్యోగులు శ్రీరాణి, వెంకటేశ్వర్లు, బాల్‌సింగ్ పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీతో మంటలు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని ఓ హోటల్‌లో గ్యాస్ సిలిండర్ లీకేజీ కారణంగా మంటలు వ్యాపించాయి. బస్టాండ్ సెంటర్‌లోని ఓ బిర్యానీ పా యింట్‌లో వంట చేస్తుండగా గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగాయి. దీంతో సత్తుపల్లి అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పినట్లయింది.

తేలని పోడు పోరు..

- మాణిక్యారం – ఎర్రబోడు ప్లాంటేషన్‌లో తరచూ వివాదం
- ప్రత్యామ్నాయం చూపలేదని పోడుదారుల ఆందోళన
- అక్కడే మకాం, వంటావార్పు
- తొలగించే క్రమాన ఘర్షణలు



దేరాల వద్ద పోడుదారుల కుటుంబాలు



ప్లాంటేషన్‌లో పోడుదారులు – అటవీ ఉద్యోగుల నడుమ ఘర్షణ (ఫైల్)

కారేపల్లి: ప్రత్యామ్నాయం చూపిస్తామని పోడు భూమిని లాక్కున్నారని గిరిజనులు.. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటుచేసిన ప్లాంటేషన్‌లో సాగు చేయనిచ్చేది లేదని అటవీ అధికారులు.. ఇలా ఎవరికి వారు పట్టు వీడకపోవడంతో ఘర్షణలు నిత్యకృత్యమయ్యాయి. పోడు భూమి తప్ప తమకు ఆధారం లేనందున ప్రత్నామాయం చూపించాలని, లేకపోతే ఇక్కడే సాగు చేసుకోనివ్వాలని గిరిజనులు కోరు తూ తరచుగా దున్నేందుకు సిద్ధమవుతుండడం.. అధికారులు అడ్డుకునేక్రమాన గొడవలు జరుగుతున్నాయి. అయినా గిరిజనులు మాత్రం వెనక్కి తగ్గకుండా ప్లాంటేషన్‌లోనే డేరాలు వేసుకుని వంటా వార్పుతో అక్కడే గడుపుతుండడంతో వివాదం ఏ మలుపు తిరుగుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇదీ వివాదం...

కారేపల్లి మండలం మాణిక్యారం – ఎర్రబోడు గ్రామపంచాయతీల పరిధి మాణిక్యారం, గుడితండా, కోయగుంపు, రూప్లాతండా, ఎర్రబోడు గ్రామాలకు చెందిన సుమారు 50 కుటుంబాల గిరిజన, గిరిజనేతర పోడుదారులు ఏళ్లుగా పోడు చేసుకుంటున్నారు. వీరంతా కారేపల్లి ఫారెస్టు రేంజ్ పరిధి ఊట్కూరు నార్త్ బీట్‌లో సుమారు 150 ఎకరాల్లో తాతల నాటి నుంచి పోడు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. అయితే, సుమారు 50 హెక్టార్ల పోడు భూమి స్వాధీనానికి అటవీ అధికారులు కొన్నేళ్ల క్రితం సిద్ధమయ్యారు. ఇక్కడ అటవీ ప్లాంటేషన్ ఏర్పాటు చేస్తామని చెబుతూ... పోడుదారులకు ప్రత్యామ్నాయంగా మరో చోటు భూమి చూపిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పోడుదారులు తొలుత నిరాకరించినా అధికారులు పట్టువదలకుండా పెద్దల సమక్షాన హామీ ఇవ్వడంతో 2020 సంవత్సరంలో ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు.

హామీ మరిచిన అధికారులు

ఆపై అధికారులు ప్రత్యామ్నాయ భూమి చూపించకపోగా, ఎన్నిసార్లు పోడుదారులు కలిసినా స్పందనరాలేదు. ఈమేరకు 2021లో ప్లాంటేషన్‌లోని మొక్కలను పోడుదారులు ధ్వంసం చేశారు. ఆ సమయంలో ఘర్షణ జరగగా 30మంది పోడుదారులపై కేసులు నమోదయ్యాయి. ఇందులో జాటోతు కిషన్, కాంపాటి రమేష్, భూక్యా రమేష్, రాయల మహేష్, కళమ్మ, వెంకన్న కోర్టుకు సైతం హాజరయ్యారు. ఇదే తరహాలో 2023, 2024లో కూడా పోడుదారులు ప్లాంటేషన్‌లోకి ప్రవేశించి మొక్కలు ధ్వంసం చేయడం, దున్నేందుకు యత్నించడం.. అధికారులు అడ్డుకుని కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారింది. అయినా వివాదం సద్దుమణగలేదు. ఈసారి 7వ తేదీన పోడుదారులు అరకలు కట్టి దున్నుతుండగా.. అధికారులు అడ్డుకున్నారు. అక్కడ ఘర్షణ జరగడంతో ఎఫ్‌డీఓ వెంకన్న చేరుకుని త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

దేరాలు వేసుకుని మకాం

అధికారులు హామీ ఇచ్చి వారం దాటినా ఎలాంటి స్పందన లేకపోవడంపై పోడుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు ప్లాంటేషన్ వద్దే డేరాలు వేసుకుని వంటావార్పు చేసుకుంటూ గడుపుతున్నారు. ఇక బుధవారం కూడా పోడుదారులు – ఉద్యోగుల నడుమ తారస్థాయిలో ఘర్షణ జరిగింది. సీపీఎంతో పాటు, అనుబంధ ప్రజాసంఘాలు పోడుదారులకు మద్దతు తెలుపుతూ పోడు పోరు తేల్చేదాకా ఆందోళనలు కొనసాగిస్తామని చెబుతుండడం గమనార్హం.

పోడు ఘర్షణలో 16మందిపై కేసు

కారేపల్లి: మండలంలోని మాణిక్యారం, ఎర్రబోడు పోడు ప్లాంటేషన్‌లో పోడుదారులు, అటవీ ఉద్యోగులకు బుధవారం ఘర్షణ జరగగా, అటవీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్లాంటేషన్‌లోకి అక్రమంగా ప్రవేశించి ధ్వంసం చేయడమే కాక తమ విధులకు ఆటంకం కలిగిస్తూ దాడి చేశారంటూ ఊట్కూరు ఎఫ్‌ఎస్‌ఓ శిల్ప ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పోడుదారులు, సీపీఎం నాయకులు 16మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి.గోపి తెలిపారు.

మాపై కేసులు పెట్టారు..



ప్రత్యామ్నాయం చూపించకపోగా మాపైనే కేసులు పెట్టారు. కేసులతో నాలుగేళ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతున్నాం. భూమి లేక కుటుంబం వీధినపడే పరిస్థితి వచ్చింది. తాతల నుంచి సాగు చేస్తున్న భూమి లాక్కుంటే మేమెలా బతకాలి.

– భూక్యా రమేష్, పోడుదారుడు, గుడితండా

భూమి లాక్కున్నారు..



తాతల నాటి నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాం. ఇంకోచోట భూమి చూపిస్తామని చెప్పి ప్లాంటేషన్ వేశారు. కానీ భూమి ఇవ్వకుండా మోసం చేయడంతో వీధిన పడే పరిస్థితి వచ్చింది. మాకు పోడు ప్రత్యామ్నాయం చూయించాలి.

– కరపటి అరుణ, పోడుదారురాలు, కోయగుంపు

ప్లాంటేషన్ బాధ్యత మాది



రూ.లక్షలు వెచ్చించి మొక్కలు నాటి ఏళ్లుగా సంరక్షిస్తున్నాం. ఆ ప్లాంటేషన్‌ను కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది. పోడుదారులకు ప్రత్యామ్నాయ భూమి చూపించడంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం ఉంటుంది.

– పి.ఏపాప్రొడిటర్స్, ఎఫ్ఆర్ఓ, కారేపల్లి

హామీల అమలు కోసం పోరాడుతాం..



వైరాలో మాట్లాడుతున్న శ్రీరామ్‌నాయక్

వైరా: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుకోసం ప్రభుత్వంపై పోరాడుతామని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీరామ్‌నాయక్ తెలిపారు. వైరాలోని సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన సంఘం ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అంబేడ్కర్ అభయహస్తం పేరుతో ప్రతీ కుటుంబానికి రూ.12లక్షల సాయం, కొత్త ఐటీడీఏలు, ఎస్టీ కార్పొరేషన్ల ఏర్పాటు, బెస్ట్ అవైలబుల్ బకాయిల విడుదల, పోడు రైతులకు పట్టాల పంపిణీలో జాప్యం చేయడం సరికాదన్నారు. ఈ హామీల అమలు కోసం ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ, గిరిజన హక్కుల దినోత్సవం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని తెలిపారు. కాగా, కారేపల్లిలో పోడు చేస్తున్న గిరిజనులపై దాడి చేసిన అటవీ ఉద్యోగులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అటవీ అధికారులపై ఫిర్యాదు చేస్తాం

కారేపల్లి: పోడు సాగుదారులపై అటవీ అధికారులు వ్యవహరించిన తీరుపై గవర్నర్‌తో పాటు మహిళా, ఎస్టీ కమిషన్లకు ఫిర్యాదు చేస్తామని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్రీరామ్‌నాయక్ తెలిపారు. కారేపల్లి ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో ఎఫ్ఆర్ఓ పి.ఏపాప్రొడిటర్‌తో నాయకులు సమావేశం కాగా శ్రీరామ్‌నాయక్ మాట్లాడారు. మాణిక్యారం, ఎర్రబోడులో ఏళ్లుగా పోడు సాగు చేసుకుంటున్న వారి నుంచి భూమి లాక్కుని ప్రత్యామ్నాయం చూపకపోగా దాడి చేయడం సరికాదన్నారు. అయితే, రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన ప్లాంటేషన్‌ను పరిరక్షణ బాధ్యత తమపై ఉందని ఎఫ్ఆర్ఓ బదులిచ్చారు. కాగా, నాయకులు తొలుత అటవీ పోడు రైతులు, మహిళలను పరామర్శించారు. కార్యక్రమాల్లో నాయకులు భూక్యా వీరభద్రం, అమర్‌సింగ్, బాదావత్ శ్రీను, భూక్యా కృష్ణ, కున్సోత్ షణ్ముక్, బానోత్ బన్సీలాల్, తేజావత్ కృష్ణకాంత్, నాగేశ్వరరావు, అజ్మీరా శోభన్, వినోద్‌కుమార్, రమేష్, సీతారాములు, నందియా, శంకర్, కుమార్, అమర్‌సింగ్, వజ్జా రామారావు, ధరావత్ వినోద్‌కుమార్, కె.నరేందర్, కె.ఉమావతి, ముండ్ల ఏకాంబరం, అన్నారపు కృష్ణ, ఎల్లంకి పిచ్చయ్య పాల్గొన్నారు.

పోటాపోటీగా జాతర వేలం పాటలు

- గతేడాది కంటే పెరిగిన ఆదాయం

కారేపల్లి: కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలోని శ్రీ కోటమైసమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో దసరా పండుగకు జరిగే జాతర సందర్భంగా షాపుల ఏర్పాటుకు దేవాదాయ, ధర్మదాయ శాఖ అధికారులు గురువారం వేలం నిర్వహించారు. దాదాపు అన్ని అంశాల్లో గతేడాది కంటే పాటదారులు హెచ్చు ధరతో దక్కించుకోవడంతో ఆలయ ఆదాయం పెరిగింది. లడ్డూ, పులిహోర అమ్మకానికి గతేడాది రూ.81వేలు పలకగా.. ఈసారి రూ.1.51 లక్షలు పలికింది. అలాగే పుట్నాలు, పేలాల అమ్మకాలకు రూ.41వేలు ఉంటే ఈసారి రూ.72వేలు, కొబ్బరిచిప్పలు ప్రోగు చేసుకునే హక్కు కోసం రూ.64వేలు పలికితే ఈసారి రూ.1.81లక్షలు, మిఠాయి అమ్మకానికి రూ.1.42లక్షలు వస్తే ఈసారి రూ.2.10లక్షలు, ఐస్‌క్రీమ్ అమ్మేందుకు రూ.30వేలు ఉండగా.. ఈ ఏడాది రూ.36,500గా పలికింది. అయితే, కొబ్బరికాయలు, పూజ సామగ్రి అమ్మకానికి సరైన ధర రాకపోవడంతో వేలం వాయిదా వేశారు. పర్సా ట్రస్ట్ చైర్మన్ పర్సా పట్టాభిరామారావు, ఆలయ ఈఓ వేణుగోపాలాచార్యులు, పర్యవేక్షణాధికారి ఈఎల్‌వీ.వెంకటరావు, ఉద్యోగులు పగడాల మోహన్‌కృష్ణ, పర్సా లలిత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. బకాయిలు విడుదల!

- మహిళా సంఘాల వీఎల్‌ఆర్ బకాయిలు
- మహిళాశక్తి సంబురాల్లో పంపిణీ చేస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం శుభవార్త అందించింది. మహిళా సంఘాలకు ఇచ్చే వడ్డీ లేని రుణాల(వీఎల్‌ఆర్)కు సంబంధించి వడ్డీ బకాయిలను విడుదల చేసింది. గతేడాది కొంత మేర బకాయిలు విడుదల చేయగా.. తాజాగా మరి కొన్ని నెలల బకాయిలను విడుదల చేయడంతో సభ్యుల్లో హర్షం వ్యక్తమవుతోంది. కాగా, ఈ బకాయిల చెక్కులను ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో అధికారులుల పంపిణీ చేస్తున్నారు.

నిరీక్షణకు తెర..

తెలంగాణ ఏర్పడ్డాక మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చే పథకం కొనసాగించినా, వడ్డీ బకాయిల చెల్లింపులో జాప్యం జరిగింది. కొన్నేళ్లుగా వీఎల్‌ఆర్ వడ్డీ బకాయిలు సక్రమంగా రాకా మహిళ సంఘాల సభ్యులు ఆందోళన చెందారు. సెర్ప్ ఆధ్వర్యాన ఎస్‌హెచ్‌జీలకు వడ్డీ వచ్చినా.. మెప్మా ఆధ్వర్యంలోని సంఘాలకు విడుదల కాకపోవడంతో మహిళలు నిరుత్సాహపడ్డారు. తాజాగా ప్రభుత్వం మెప్మా ఆధ్వర్యాన సంఘాలకు వడ్డీ బకాయిలను భారీగా విడుదల చేయడంతో మహిళా సంఘాలకు ఊరట కలిగిస్తోంది.

మెప్మా పరిధిలోని సంఘాలకు ఊరట

మెప్మా పరిధిలో నిర్వహించే మహిళా సంఘాలకు పాత బకాయిలతో పాటు గత ఆర్థిక సంవత్సరం వీఎల్‌ఆర్ బకాయిలను సైతం ప్రభుత్వం విడుదల చేసింది. 2023 డిసెంబర్ నుంచి 2024 మార్చి వరకు, 2024–25 ఆర్థిక సంవత్సరం 4,480 సంఘాలకు రూ.4,28,35,720 విడుదలయ్యాయి. దీంతో నెలలుగా వడ్డీ బకాయిల కోసం ఎదురుచూస్తున్న మహిళా సంఘాల సభ్యులకు ఊరట లభించింది. ఇక డీఆర్‌డీఏ-సెర్ప్ ఆధ్వర్యాన నిర్వహించే గ్రామీణ ప్రాంత మహిళ సంఘాలకు సంబంధించి గత బకాయిలను గతేడాది విడుదల చేయగా.. తాజాగా 2024 ఏప్రిల్ నుంచి 2024 సెప్టెంబర్ వరకు ఆరు నెలల వడ్డీ బకాయిలు 19,027 సంఘాలకు రూ.22.90 కోట్లు విడుదలయ్యాయి. కాగా, వడ్డీ బకాయిల చెక్కులను ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో మంత్రుల చేతుల మీదుగా సంఘాల సభ్యులకు అందజేస్తున్నారు.

మెప్మా ఆధ్వర్యాన విడుదలైన వీఎల్‌ఆర్ వడ్డీ బకాయిలు (రూ.ల్లో)

కార్పొరేషన్ / మున్సిపాలిటీ	2023–24	2024–25
ఖమ్మం	82,43,957	1,99,50,191
మధిర	15,45,234	47,92,792
సత్తుపల్లి	9,44,409	23,60,013
వైరా	14,71,263	35,27,861

డీఆర్‌డీఏ-సెర్ప్ ఆధ్వర్యాన విడుదలైన బకాయిలు (రూ.కోట్లలో)

మండలం	ఎస్‌హెచ్‌జీలు	విడుదలైనవి	మండలం	ఎస్‌హెచ్‌జీలు	విడుదలైనవి
ఖమ్మం రూరల్	1,444	1.81	తిరుమలాయపాలెం	1,046	1.13
కల్లూరు	1,170	1.44	వేంసూరు	954	1.11
నేలకొండపల్లి	1,126	1.43	తల్లాడ	923	1.05
ముదిగొండ	1,088	1.42	మధిర	767	1.00
ఎర్రుపాలెం	918	1.33	బోనకల్	853	0.95
కూసుమంచి	969	1.25	పెనుబల్లి	861	0.94
కొణిజర్ల	954	1.25	వైరా	711	0.84
చింతకాని	964	1.22	సింగరేణి	894	0.84
రఘునాథపాలెం	934	1.18	కామేపల్లి	735	0.83
సత్తుపల్లి	911	1.15	ఏన్కూరు	646	0.72

నివేదిక ఇవ్వడమే మా బాధ్యత

సత్తుపల్లి: ఆయిల్‌పామ్ తోటల్లో అఫ్‌టైప్ మొక్కలు వచ్చాయనే రైతుల ఫిర్యాదులతో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని ఐఐఓపీఆర్ శాస్త్రవేత్త డాక్టర్ రామచంద్రు తెలిపారు. సత్తుపల్లిలో గురువారం ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు ఖమ్మంలో 13, భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో 16 చోట్ల పర్యటించి 29 తోటల్లో 65 శాంపిళ్లను సేకరించామని వెల్లడించారు. సత్తుపల్లి మండలంలోని పాకలగూడెం, గౌరిగూడెం, నారాయణపురంల్లో రైతుల తోటలను పరిశీలించగా అఫ్‌టైప్ మొక్కలపై ఆరా తీశామని తెలిపారు. కాగా, మొక్కల శాంపిల్స్‌ను పెదవేగి కేంద్రానికి పంపించడం, అక్కడి నుంచి వచ్చే నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించడం వరకే తమ బాధ్యత అని వెల్లడించారు. అఫ్‌టైప్ మొక్కలు సీడ్ కారణంగా వచ్చాయా, జన్యుపరమైన లోపాలున్నాయా, రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలను నివేదికలో పొందుపర్చి ప్రభుత్వానికి అందిజేయనున్నట్లు చెప్పారు. ఆతర్వాత ప్రభుత్వానిదే తుది నిర్ణయమన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.వీ.ప్రసాద్, బి.కల్యాణబాబు, హార్టికల్చర్ అధికారి ఎం.వీ.మధుసూదన్, ఆయిల్‌ఫెడ్ అధికారి శంకర్, రైతులు తుంబూరు మహేశ్వరరెడ్డి, చెలికాని వెంకట్రావ్, తుంబూరు కృష్ణారెడ్డి, చక్రధర్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళల్లో రక్తహీనత నివారణకు కృషి

డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: బస్తీ దవాఖానాలకు వచ్చే మహిళల్లో రక్తహీనతను నివారించేందుకు వైద్యులు కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కళావతిబాయి సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె డిప్యూటీ డీఎంహెచ్‌ఓ చందునాయక్‌తో కలిసి బస్తీ దవాఖానా డాక్టర్లతో సమావేశమయ్యారు. ఓపీ నమోదు, రోగ నిర్ధారణ పరీక్షలు, గర్భిణులు, బాలింతలకు వ్యాక్సినేషన్, కుటుంబ నియంత్రణ కౌన్సెలింగ్, రక్తహీనత, షుగర్, బీపీ, కేన్సర్ పరీక్షల్లో శ్రద్ధ వహించాలని తెలిపారు. అనీమియా ముక్త్ భారత్‌లో భాగంగా బాలబాలికలు, గర్భిణులు, బాలింతలు, పునరుత్పత్తి వయస్సు గల వారిలో రక్తహీనతను తగ్గించడానికి పాటుపడాలని సూచించారు. కాగా, సేవల విషయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఉద్యోగులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డెమో సుబ్రహ్మణ్యం, స్టాటిస్టికల్ ఆఫీసర్ నవీన్, ఎన్‌హెచ్‌ఎం డీపీఎం దుర్గ తదితరులు పాల్గొన్నారు.

పలు పోస్టుల రద్దు.. అవసరమైనవి భర్తీ

విద్యుత్ శాఖ అధికారుల నిర్ణయం

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ శాఖలో వినియోగంలో లేని పలు పోస్టులను కుదించడమే కాక ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ఎన్పీడీసీఎల్ చర్యలు చేపట్టింది. ఏళ్లుగా వివిధ కేటగిరీలకు చెందిన 433 పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. ఈ పోస్టుల్లో 217 జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉండడం, ఇంకొన్ని పోస్టులు కూడా భర్తీకి నోచుకోకపోవడంతో వీటిని రద్దు చేసి అవసరమైన పోస్టులు భర్తీ చేయాలని సంస్థ నిర్ణయించింది. ఈమేరకు సర్కిల్ పరిధిలో విధివిధానాల రూపకల్పనకు ఖమ్మం ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి అధికారులతో సమావేశమై వివరాలు ఆరా తీశారు. డీఈలు చినబాబూరావు, నంబూరి రామారావు, నాగేశ్వరరావు, రాములు, భద్రూపవర్, ఎస్‌ఏఓ శ్రీధర్, పీఓ తిరుపతి, జేఏఓ నరేష్‌కుమార్, కార్మిక సంఘాల ప్రతినిధులు మందపాటి సత్యనారాయణరెడ్డి, సీతారాం గోపాల్, శేషగిరిరావు, రమణారెడ్డి, ఉపేందర్, ప్రసాద్, నాగేశ్వరరావు, బీవీస్ మూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన ట్యాంకర్..

ఒకరు మృతి

కారేపల్లి: ద్విచక్రవాహనాన్ని ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. మండల పరిధిలోని ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రహదారి కొమ్ముగూడెం స్టేజీ వద్ద గురువారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలను స్థానికులు ఇలా తెలిపారు. మండలంలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన దుగ్గి సూర్యనారాయణ (52) ద్విచక్రవాహనంపై ఇల్లెందు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈక్రమంలో కొమ్ముగూడెం స్టేజీ వద్దకు రాగానే ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు వెళ్తున్న ట్యాంకర్‌లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందగా.. స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని మరొకరు..

ముదిగొండ: ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఓ ద్విచక్ర వాహనదారుడు తీవ్రగాయాలతో మృతి చెందాడు. మండలంలోని పెద్దమండవ మున్నేరు నుంచి గురువారం కమలాపురం మీదుగా పమ్మి వైపు వస్తున్న ఇసుక ట్రాక్టర్ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న చింతకాని మండలం తిమ్మినేనిపాలెం గ్రామానికి చెందిన కొమ్ము బాలస్వామి(50)ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. పమ్మిలో తన అక్క వద్దకు వచ్చి వెళ్తున్న ఆయన ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా నడపడంతో మృత్యువాత పడ్డాడు. బాలస్వామి కుమారుడి ఫిర్యాదుతో ముదిగొండ పోలీసులు కేసు నమోదు చేశారు.

గేదెను తప్పించబోయి ఆటో బోల్తా..

ఐదుగురికి తీవ్రగాయాలు

నేలకొండపల్లి: గేదెను తప్పించే క్రమాన ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. మండలంలోని కోనాయిగూడెంకు మహిళా సంఘం సభ్యులు కూసుమంచిలో గురువారం జరిగిన మహిళా శక్తి సంబురాలకు హాజరై వస్తున్నారు. వీరు ఆటోలో ప్రయాణిస్తుండగా మధ్యలో అడ్డు వచ్చిన గేదెను డ్రైవర్ తప్పిస్తుండగా అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కొమ్మినేని శ్రీదేవి, గూడెల్లి మహేశ్వరి, గూడెల్లి పుల్లమ్మ, పెంద్ర కోటమ్మ, కుంచం వీరమ్మకు తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలిసి వైద్యులతో మాట్లాడిన మంత్రి పొంగులేటి.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

ఆభరణాలు, నగదు చోరీ

వైరారూరల్: మండలంలోని విప్పలమడకకు చెందిన యడ్లపల్లి మంగయ్య ఇంట్లో చోరీ జరిగింది. మంగయ్య – పద్మావతి దంపతులు బుధవారం రాత్రి ఇంటి తలుపులకు గడియ వేసి ఆరుబయట నిద్రించారు. ఈమేరకు దుండగులు వెనుకాల గోడ పైనుంచి లోనికి జొరబడి బీరువాను పగులగొట్టి రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.65 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు గురువారం ఆధారాలు సేకరించగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు.

డెయిరీ నిధుల గోల్‌మాల్‌పై విచారణ

బోనకల్: ఇందిరా డెయిరీలో సభ్యత్వం కోసం మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన వాటాధనం దుర్వినియోగం అయినట్లు వచ్చిన ఆరోపణలపై మండలంలోని రాపల్లిలో ఉద్యోగులు బుధ, గురువారాల్లో విచారణ చేపట్టారు. ఐకేపీ సీసీలు శ్రీనివాసరావు, ఝాన్సీ, పుల్లయ్యతో పాటు సిబ్బంది గ్రామంలో వాటాధనం చెల్లించిన సభ్యులను కలిసి వివరాలు సేకరించారు. కాగా, 17మంది నుంచిరూ.2,100 చొప్పున వసూలు చేసి కొందరు రశీదు ఇవ్వగా, ఇంకొందరికి ఇవ్వలేదని గుర్తించారు. అలాగే, వీరి నగదును మండల సమాఖ్య అకౌంట్‌లో జమ చేయలేదని తేల్చారు. పూర్తిస్థాయిలో విచారణ అనంతరం డీఆర్‌డీఓకు నివేదిక ఇవ్వనున్నట్లు సీసీలు తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.దీప గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. ఖమ్మంకు చెందిన నిమ్మగడ్డల ప్రదీప్ చౌదరి వద్ద మద్దెల మహేష్‌బాబు 2017 జులై 8న రూ.1.50 లక్షల అప్పు తీసుకున్నాడు. ఆపై 2019 ఆగస్టు 28న రూ.2 లక్షలకు జారీ చేసిన చెక్కును ప్రదీప్ బ్యాంకులో జమ చేయగా, మహేష్ బ్యాంక్ ఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో ప్రదీప్ తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. ఈమేరకు మహేష్‌పై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలుశిక్ష విధించడమే కాక పరిహారంగా రూ.2లక్షలు చెల్లించాలని జడ్జి తీర్పు చెప్పారు.

నాలుగు కేజీల గంజాయి స్వాధీనం

ఖమ్మంక్రైం: ఒడిశా నుంచి మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న గంజాయిని ఖమ్మం త్రీటౌన్ పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని పూణేకు చెందిన ఖురేషి గంజాయి వ్యాపారం చేస్తుంటాడు. ఆయన సూచనలతో పూణేకు చెందిన మహేష్ ఫెరాక్, సర్ఫరాజ్ షేక్, విశాల్ ఒడిశాలోని మల్కాన్‌గిరికి వెళ్లి రూ.4లక్షల విలువైన నాలుగు కేజీల గంజాయి కొనుగోలు చేశారు. సరుకుతో మహారాష్ట్రకు వెళ్లేందుకు ఖమ్మం చేరుకోగా కొత్తబస్టాండ్ సమీపాన పట్టుబడ్డారని సీఐ మోహన్‌బాబు తెలిపారు.